ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 11 | సంచిక : 5 | జనవరి 2006

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 5/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

నరసాపురం ...... 30-10-05
జిన్నూరు............ 07-11-05
అరుణాచలం ..... 14-12-05
అరుణాచలం ..... 18-12-05
అరుణాచలం ..... 11-12-05
అన్నవరం........... 12-10-05

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-10-05, నర్సాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం చేసే సేవ నాసిరకంగా ఉండకూడదు. మనం బట్టలో నాణ్యత ఎలా చూసుకొంటావెూ, చదువులో క్వాలిటీ ఎలా చూసుకొంటామో అలాగే మనం చేసే సేవలో కూడా నాణ్యత ఉండాలి. కర్త లేకుండా కర్మ చేస్తూఉంటే అది యోగం అవుతుంది, అప్పుడు పునర్జన్మను తీసుకొనివచ్చే వాసనలు క్షీణిస్తాయి. ఏదో ఒక యోగం లేకుండా, ఉపాసన లేకుండా తత్వం తెలియబడదు. స్వార్థం లేకుండా, నిరాడంబరంగా, నిరహంకారంగా ఏపని చేసినా అది ఇహానికి, పరానికి ఉపయోగపడుతుంది, ఇది భక్తులయిన మనం అందరం నేర్చుకోవాలి. ఆత్మజ్ఞానసముపార్జనకు ఏకాగ్రత ఒక్కటే సరిపోదు, క్రమశిక్షణ అవసరం. జీవితంలో అభివృద్ధిలోనికి రావాలంటే కేవలం తెలివితేటలు, పనిలో ఉన్న నేర్పు సరిపోదు, క్రమశిక్షణ అవసరం. విద్యలు చాలా ఉన్నాయి, నిజమైన విద్య ఏది? మన అంతఃకరణాన్ని బాగుచేసుకోవటానికి అంటే మనస్సును నిగ్రహించుకోవటానికి ఏవిద్య అయితే సహకరిస్తుందో అదే నిజమైనవిద్య, మిగిలినవి అన్నీ పొట్టకు సంబంధించిన విద్యలు అని రామకృష్ణుడు చెప్పారు.

ఏమతం అయినా కేవలం సిద్ధాంతాల మీద ఆధారపడి అభివృద్ధిలోనికి రాదు. శాస్త్రంలో చెప్పినప్రకారం, భగవంతుడు చెప్పిన మాటలకు అనుగుణంగా జీవిస్తూ, సమాజం యొక్క చైతన్య స్థాయిని పెంచుతూఉండే మహర్షులు, మహాత్ములు ఆమతంలో ఎంత మంది ఉంటే అంత అభివృద్ధి అవుతూఉంటుంది. త్రికరణశుద్ధిగా మనం పనిచేస్తూ ఉంటే అది యోగం అవుతుంది, దానివలన మనం పవిత్రులం

అవుతాము, భగవదనుభవం పొందటానికి అర్హులమవుతాము. రామకృష్ణుడు తరచు ఒక మాట చెప్పేవారు సూర్యుడు ఉదయించాక నక్షత్రాలు కనబడవు, అంటే నక్షత్రాలు లేవని కాదు అవి నీకళ్లకు కనబడటం లేదు అంతే. నీ హృదయంలో పరమేశ్వరుడు ఉన్నాడు. ఆయన నీకు కనబడటం లేదు అంటే ఆయన లేడు అని కాదు, నీలో ఉన్న అజ్ఞానం వలన, వ్యక్తి భావన వలన ఆయన నీకు కనబడటం లేదు. వస్తువు తనంతట తానుగా ఉంది, అది ఉండటం వలననే అది మనకు తెలియబడుతుంది. పని పనికోసమే చెయ్యి. వచ్చేది వస్తుంది, రానిది రాదు. ప్రతీదానికి ఫలితం ఆశించకు అని గీతలో పరమాత్మ చెప్పాడు. ఆసక్తి లేకుండా పనిచేస్తే అది నీ శారీరక, మానసిక ఆరోగ్యానికి సహకరిస్తుంది. లౌకికులకు దూరంగా ఉండండి, వారి మాటలకు మీరు ఆందోళనకు గురి కావద్దు, వారు మిమ్మల్ని పొగిడినా విమర్శించినా ఏమీ పట్టించుకోవద్దు, ఎప్పటికప్పుడు మనస్సును బేలెన్స్ చేసుకొంటూ ఉండాలి. ఈశ్వరుని పట్ల భక్తి కలిగి ఉండాలి. జన్మల తరబడి, జన్మల తరబడి ఆరాధించగా ఆరాధించగా ఈశ్వరుడే నీకు గురురూపంలో ప్రత్యక్షమవుతాడు, ఆయన దయ వలన నీకు శాంతి కలుగుతుంది. మనకు స్వప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, ఈశ్వరుని దయ ఉండాలి. ఇవిఅన్నీ కలిసివస్తేనే భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా ఆ పని పూర్తిఅవుతుంది. ఒకోసారి పెద్దప్రయత్నం చేస్తాము, పని సున్నా. ఒకోసారి చిన్నప్రయత్నం చేస్తేనే పని పూర్తిఅవుతుంది. మనం చేస్తున్న ప్రయత్నానికి ఫలితం ఇస్తాడు, ఆయనకు ఏమీ అక్కరలేదు, అందుచేత తొందరపాటు పనికిరాదు.

రాగద్వేషములు తగ్గించుకోవటానికి మనం బాగా ప్రయత్నం చేయాలి ఎందుచేతనంటే మనం ఎక్కడికివెళ్లినా మనలను బంధించేవి ఈ రాగద్వేషములే. లోకం నిన్ను బంధించటం లేదు. లోకం మీద నీకు ఉన్న రాగద్వేషములే నిన్ను బంధిస్తున్నాయి. రాగద్వేషాలు లేకపోతే నీ మనస్సు బాహ్యముఖానికి వెళ్లదు. రాగద్వేషాలు లేకుండా నీవు లోకంలో విషయాలు గ్రహిస్తున్నప్పటికీ నీకు అశాంతి తీసుకొనిరావు. నీబుద్ధి మోహకలిలంలో ఉన్నప్పుడు నీకు తత్వం తెలియదు. మోహంలో నుండి బయటకు వచ్చినప్పుడే భగవంతుడు చెప్పిన మాట యొక్క విలువ మనకు తెలుస్తుంది, శాస్త్రం పట్ల మనకు గౌరవం పెరుగుతుంది, శాస్త్రంలో చెప్పిన ప్రకారం జీవించాలనే బుద్ధి మనకు కలుగుతుంది. ప్రారబ్దాన్ని బట్టి నీకు ధనం రావచ్చు, గౌరవం రావచ్చు, పదవులు రావచ్చు. ప్రతీదీ వస్తుంది, పోతుంది. ఎన్ని వచ్చినా సరే వాటితో తాదాత్మ్యం చెందవద్దు. నీకు నిద్రలో వచ్చేది చిన్న కల, ఇది పెద్ద కల అంతకంటే తేడా ఏమీ లేదు, అంతా స్వప్నమే. దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి కష్టంగానో,

సుఖంగానో రోజులు వెళ్ళిపోతాయి. అంతా ఈశ్వర సంకల్పంతో జరిగిపోతోంది అనే ఈ ఒక్క వాక్యం మీకు అర్థమయితే దుఃఖరహితస్థితి వస్తుంది. జరగవలసింది జరుగుతుంది, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగదు, ఇది నిశ్చయం. నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్. ఊరికే నిమిత్త మాత్రంగా ఉండు చేసేది అంతా ఈశ్వరుడే. ఈ శ్లోకం రోజూ గుర్తుపెట్టుకోండి. ఈశ్వరుడు ఉపాధిరహితుడు. రూపం లేనిదానిని, నామం లేని దానిని మనం ఊహించలేము కాబట్టి ఆయన ఒక రూపాన్ని, నామాన్ని పెట్టుకొని రావచ్చు అప్పుడు కూడా వాడు ఉపాధిరహితుడు. మధురైలో కృష్ణ జన్మస్థానం గదిలో ఇక్కడ కృష్ణుడు పుట్టాడు అని వ్రాయలేదు, పుట్టినవానివలె కనిపించాడు అని వ్రాసారు.

జ్ఞానం అంటే ఏమిటి అనుకొంటున్నావు నరేన్ ఓ భగవంతుడా! నీవే కర్తవు, నేను అకర్తను, ఇదేనయ్యా జ్ఞానం అంటే, ఇంతకు మించి ఏమీలేదు అన్నాడు రామకృష్ణుడు. అయితే ఇది మనకు అర్థం అవ్వాలి. మనం కర్త అనుకోవటం వలన మనకు దుఃఖం వస్తోంది. దేహబుద్ధి ఉన్నంతకాలం నేను కర్తను అని అనుకోకుండా ఉండలేడు. రామకృష్ణుడు పైన చెప్పిన వాక్యం మనం చదువుకోవచ్చు కాని అది అనుభవంలోనికి రావటం లేదు. మనలో జీవలక్షణాలు ఉన్నంతకాలం రామకృష్ణుడు చెప్పిన వాక్యం మనకు అర్థమవద్దు. దుఃఖం బయటలేదు, మనలోపల కర్తృత్వరూపంలో ఉంది. కర్తృత్వం ఉన్నంతకాలం ఈ జన్మలోనే కాదు రాబోయేజన్మలో కూడా దుఃఖం మనలను వెంటాడుతుంది. మనం ఏ పని చేసినా, ఏది మాట్లాడినా, ఏది ఆలోచించినా నేనుతో చేస్తాము, అక్కడ నుండి కర్తృత్వం ప్రారంభమవుతుంది, కర్తృత్వం దుఃఖాన్ని తీసుకొని వస్తుంది, అశాంతిని తీసుకొని వస్తుంది. కర్త నీవు కాదు, కర్త ఈశ్వరుడే. మనకు ప్రతీదానికి భయం. ప్రతీవాడు ఏదో ఒకటి ఊహించుకొని భయపడతాడు కాని వాడు ఊహించుకొన్నది ఏమీ జరుగదు. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడని విశ్వాసం లేక, ఆయన మీద భారం వేయటం చేతకాక మనం భయానికి గురిఅవుతాము. ఎవడైతే నూటికి నూరుపాళ్ళు భగవంతుడి మీద భారంవేసి జీవిస్తున్నాడో వాడికి భయంతో సంబంధం లేదు. ఇవిఅన్నీ మనం బాగుపడటానికి చెప్పిన మాటలు. ఇల్లు కట్టుకోవాలంటే దానికి కావలసిన మెటీరియల్ అంతా పోగుచేసుకొంటాము అలాగే మోక్షం పొందటం కోసం తగిన సామగ్రి అంతా సమకూర్చుకోవాలి. నాకు మోక్షం కావాలంటే వచ్చేయదు. మనం లోపల కూల్‌గా ఉండాలి, లోతులు పెంచుకొంటూ రావాలి, మనలో ఏదో ప్రత్యేకత ఉన్నట్లు ఇతరులకు కనబడకూడదు. నాలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటే వాడు బంధింపబడతాడు.

భక్తి అనేది నీకు, ఈశ్వరుడికి సంబంధించిన విషయం, సమాజానికి ఏమీ సంబంధం లేదు. లోపల బలం పెంచుకొంటూ రావాలి, పైకి అందరిలాగే కనబడాలి. దేహభావన తగ్గించుకొంటూరావాలి, జ్ఞానాన్ని పెంచుకోవాలి, పైకి అందరిలాగే ఉండాలి. మనకు ఈశ్వరుడి పట్ల రక్తి ఉండాలి, విషయాల పట్ల విరక్తి ఉండాలి. సబ్జక్టు మనకు ప్రోపర్‌గా అర్థమవుతూ ఉంటే మనకు శాంతి అందుతుంది. ఈశ్వరుడికి మించిన శక్తి లేదు, సౌందర్యం లేదు. సౌందర్యం అంటే లోపలది అంతేగాని చర్మసౌందర్యం కాదు. శ్రీరంగంలో ఒక భక్తుడు ఉండేవాడు. వాడికి భార్య అంటే చాలా ఇష్టం. భార్య నడుస్తూ ఉంటే ఎండ తగలకుండా గొడుగుపట్టుకొని వెనకాల వెళుతున్నాడు. ఎందుకని నీ భార్యకు గొడుగు పడుతున్నావు అని రామానుజులు అడిగారు. నా భార్య నేత్రద్వయం చాలా అందమైనవి, అవి ఎండకు కందిపోకుండా ఉండటం కోసం గొడుగుపడుతున్నాను అన్నాడు. ఇంతకంటే అందమైన కళ్ళు చూపిస్తాను వస్తావా? అని రామానుజులు అడిగారు. వస్తాను అన్నాడు ఆ భక్తుడు. రామానుజులు ఆ భక్తుడిని గుడికి తీసుకొని వెళ్ళి నీ నేత్రాల యొక్క సౌందర్యాన్ని చూపించమని రంగనాధుడిని ప్రార్థిస్తాడు. రంగనాధుడి యొక్క సౌందర్యం చూసాక ఆ భక్తుడిలో మార్పు వచ్చింది. భార్య మీద ఉన్న రక్తి, భక్తి అంతా కూడా భగవంతుడి వైపు మళ్ళింది. రంగనాధుడికి శరణాగతి చెంది, ఆయనను ఉపాసించి తరించాడు. రామానుజుల దయవలన ఇది అంతా జరిగింది. జీవుడిని భగవంతుడితో అనుసంధానం చేసేవాడే ఆచార్యుడు. ఈ ప్రకృతి ఏమిటి? పంచభూతాలు ఏమిటి? ఈశ్వరుడు ఎంత శక్తిమంతుడు? ఇటువంటి గొడవలలోనికి వెళ్ళవద్దు. ఈ దేహం మరణించకముందే మరణం లేని వస్తువును తెలుసుకొని బయటకు వెళ్ళిపో. నీకు మామిడిపండ్లు తినాలంటే తినివెళ్ళిపో అంతేగాని ఆ మామిడిచెట్టు యొక్క ఆకుల గురించి, కొమ్మల గురించి విచారిస్తూ ఉంటే నీకు మామిడి పండు దొరకదు. ఈశ్వరుడి శక్తిని నీవు ఊహించలేవు. నీవు వచ్చిన పని ఏదో చూసుకొని వెళ్ళిపో. అనిత్యమైన వాటిని ఆధారంగా చేసుకొని వాటిని ఉపయోగించు కొని నిత్యస్థితిలోనికి, సత్యస్థితిలోనికి జారిపో. మనం చనిపోతే ఈ సంసారం ఏమైపోతుంది, వీరంతా ఏమైపోతారు అనుకొంటాము, అలా అనుకోవద్దు. నీవు చనిపోతే వారు బాగుపడవచ్చు, నీవు సంపాదించినది ఏదైనా ఉంటే పంచుకొంటారు. ఇంట్లో పనిచేసే మనిషి ఎలా ఉంటుందో నీవు కూడా అలాగ జీవించు, నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. పని మనిషి మన ఇంట్లో ఉన్న పని అంతా చేస్తుంది, మన వస్తువులను జాగ్రత్తగా చూస్తుంది, మనకు ఏదైనా దుఃఖం వస్తే తనుకూడా దుఃఖపడుతుంది. కాని తన హృదయాంతరాళాలలో ఇవి ఏమీ నావి కాదు

అని ఆ పనిమనిషికి తెలుసు. నీ ఇంట్లో జీవించేటప్పుడు నీవు కూడా అలాగ జీవించు, నీవు తరిస్తావు.

మీరు పూజ చేస్తున్నారు, జపం చేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు. ఆ చేసేవాడు ఎవరు? అని ప్రశ్నించండి, దానిని డౌట్ చెయ్యండి. అప్పుడు మనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది. మీకు లోచూపు కలుగుతూ ఉంటే అనుగ్రహం యొక్క స్పర్శ మీకు తెలుస్తూ ఉంటుంది. మీకు దుఃఖం వస్తూ ఉంటే దుఃఖం దేహానికి రావటం లేదు, నేనుకు వస్తోంది. ఆ నేను ఎవరు? అని ప్రశ్నించుకోవాలి. అది నీ సొంత సమస్య, ఆ సమస్యను నీవే పరిష్కరించుకోవాలి. దానికోసం నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే, నీ ప్రయత్నమే భగవంతుని దయగా మారిపోతుంది. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడు, ఈ సృష్టినంతా నడిపిస్తున్న భగవంతుడు నీ భక్తికి లోబడి నీ హృదయంలో ఇమిడిపోతున్నాడువయ్యా, వాడు కరుణామయుడు. ఓ భగవంతుడా! నీ సిద్ధులు, మహిమలు, జ్ఞానం, సృష్టిని ఆడించే శక్తి అంతా నీ దగ్గరే పెట్టుకో. కాని నిన్ను ప్రార్థించేది ఒక్కటే నీ పాదాల యందు భక్తిని ప్రసాదించు. ప్రారబ్ధాన్ని బట్టి ఈ దేహం ఎంతకాలం ఉండాలో అంతకాలం తిరుగుతూ ఉంటుంది, ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటుంది, కాని నీవు చేయవలసింది ఏమిటి అంటే ఈ దేహం మరణించక ముందే ఈ దేహాన్ని మేగ్జిమమ్ ఉపయోగించుకొని భగవదనుభవం పొందటానికి ప్రయత్నించు. దేహాభిమానంతో పనిచేస్తే పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం అనుభవించ వలసిందే. దేహాభిమానం లేనివాడికి పుణ్యం లేదు, పాపం లేదు. బుద్ధిమంతుడు పుణ్యాన్ని, పాపాన్ని శరీరానికి మరణం రాకముందే అన్నీ ఇక్కడే వదిలేస్తాడు, వాడు పొందవలసింది పొందుతాడు.

ప్రారబ్ధం ప్రకారం శరీరయాత్ర జరిగిపోతూ ఉంటుంది అని చెపుతున్నారు కదా ఇంక మనం చేసే సాధన ఎందుకు? దేహం ద్వారా జరిగేది జరిగిపోతూ ఉంటుంది, ఆ జరిగే విషయాలతో, సంఘటనలతో తాదాత్మ్యం పొందకుండా ఉండటానికే సాధన. జరిగే విషయాలను ఆపటానికి కాదు, ఆ విషయాలతో కలవకుండా ఉండటానికి ప్రయత్నం అవసరం. దేహగతమైన చరిత్ర జరుగుతూ ఉంటుంది, దానితో తాదాత్మ్యం పొందకుండా ఉండే స్థితిని సంపాదించు. కొంతమంది తపస్సులు చేసినట్లు, భగవంతుడిని కోరికలు అడిగినట్లు, ఆయన ఇచ్చినట్లు ఉంది కదా! అని అడిగితే వారు ఎంత తపస్సులు చేసినా వారి ప్రారబ్ధంలో ఉన్నదే కోరుకొంటారు, కానీ లేనిది కోరుకోరు. భగవంతుడు ఇచ్చాను అంటాడు అంతే. "నా ధర్మపత్ని అయిన నీకంటే, నా ప్రతిరూపమైన శివుడికంటే, నా

సహోదరుడు బలరాముడు కంటే నా భక్తులు అంటే నాకు ఎక్కువ ఇష్టం రుక్మిణీ!" అంటాడు కృష్ణుడు. అంటే భక్తులకు స్వాధీనమవుతాడు. అనేక జన్మల నుండి మీరు ప్రార్థించగా, ప్రార్థించగా, స్మరించగా స్మరించగా, ఆరాధించగా ఆరాధించగా ఈశ్వరుడే కాళ్ళు చేతులు తొడుక్కొని మానవరూపంలో వస్తాడు, వాడు మనం ఒక్కటే అనుకొంటాము, వాడికి మనకు లోపల ఎంతదూరం ఉందో మనకు తెలియదు. దేహంలో ఉండు, దేహంలో ఉన్నా ఆ దేహం మీది అనుకోవద్దు, మీరు కానిదానిని మీరు అనుకోవద్దు, ఒకవేళ మీది అనుకొన్నా దేహం మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. ఈ ఒక్క వాక్యం చాలు మనం తరించటానికి, మనకు వైరాగ్యం రావటానికి సహాయసహకారములు అందిస్తుంది.

గురువు మనలో అంతర్యామిగా ఉంటాడు. నీలోని బలహీనతలను చూస్తూ ఉంటాడు, నిన్ను యాగీ చేయడు, లోపల ఉన్న వస్తువు గోచరం అవ్వకుండా నీలో ఏ ఆటంకాలు అయితే ఉన్నాయో వాటిని నెమ్మదిగా తొలగిస్తాడు. ఆయన ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితికి వెళ్ళేవరకు ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలో కూడా నిన్ను విడిచిపెట్టడు, వాడు గురువు. ఒకవేళ నీవు గురువును విడిచిపెట్టినా, ఆయన నిన్ను విడిచిపెట్టడు. ఆయన మాట అనుగ్రహం, చూపు అనుగ్రహం, శరీరం ధరించి ఉండటం అనుగ్రహం, వాడు గురువు. నీలో ఉన్న బలహీనతలను తొలగించు కోవటం నీకు భారం అవ్వవచ్చుకాని అది వాడికి భారం కాదు. నీలో ఎన్ని బలహీనతలు ఉన్నా అన్నింటినీ తొలగిస్తాడు. లోపల సిద్ధంగా ఉన్న వస్తువును నీకు సిద్ధింప చేస్తాడు, వాడు గురువు. ఎవరిని అనుకరించవద్దు, నీ పద్ధతిలో నీవు ప్రయత్నం చేసి తరించు. జీవితంలో ఏదైనా సాధించినప్పుడు నేను సాధించాను అనుకొంటే అది భగవంతుడిని అగౌరవపరచినట్లు అవుతుంది. నీవు అంటూ ఒకడివి ఉన్నావా సాధించటానికి. నీ సాధనలో మనస్సును ఇన్వాల్వు చెయ్యి, ఎందుచేతనంటే మనస్సు కరిగితేనేకాని నీకు బ్రాహ్మీస్థితి రాదు. తెర బాగా పల్చగా ఉంటే ఆ ప్రక్కన ఉన్నవాడు ఈ ప్రక్కకు కనబడతాడు. మనస్సు చిరగకపోయినా కనీసం అంత పల్చగా చేసుకొంటే లోపల ఉన్న పరమాత్మ నీకు గోచరిస్తాడు, మిగతాపని ఆయన చూసుకొంటాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-11-05, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

దీపావళి గురించి రెండు కథలు చెపుతారు. నరకచతుర్ధశి రోజున వాసుదేవుడు నరకాసురుడిని సంహరించాడని, ఆ రాక్షస సంహారం అయిన తరువాత మరుసటి రోజున దీపావళి పండుగ చేసుకొన్నారని చెపుతారు. ఉత్తరప్రదేశ్‌లో ఇంకోరకంగా చెపుతారు.